
కథ

# పావురాయి గూడు

సంపర జ్యోతి



నా చిన్న కొడుకు నిద్దట్లో నాపైన వేసిన కాలు తీసి పక్కనపెట్టి మెల్లిగా లేచి వంటగదిలోకి వెళ్లాను. తెల్లారితే హడావుడి మొదలు. పిల్లలకి పాలు... టిఫిన్‌లు చేయడం, స్కూలుకి తయారు చేయడం... తొమ్మిది గంటల వరకూ బొంగరంలా హడావుడి.... పిల్లలింకా నిద్ర లేవలేదు...

మెల్లగా... గుర్...గుర్...మంటూ శబ్దం విని పించింది. నాకేమీ అర్థం కాలేదు. చుట్టూ పరకాయించి చూశాను. ఏమీ కనిపించ లేదు. ఇంతలో నా పెద్ద కొడుకు నిద్రలేచి కళ్లు నలుముకుంటూ నా దగ్గరకి వచ్చి నిల్చున్నాడు.

నేను స్తబ్దుగా నిలబడటం చూసి "ఏంటి?" అన్నట్లుగా నా వైపు చూశాడు.

వాడిని దగ్గరకు తీసుకుంటూ "శబ్దమేదో వస్తోందిరా... వింటున్నా... అదేంటో, ఎక్కడి నుంచి వస్తోందో అర్థం కావడం లేదు" అన్నాను.

మళ్లీ... గుర్...గుర్...మని శబ్దం వినిపించింది.

వాడు అటూ ఇటూ పరకాయించి చూసి నెమ్మదిగా తల పైకెత్తి అటక వైపు నుంచి శబ్దం వస్తున్నట్లుగా వేలితో చూపించాడు.

'నిజమేగా... నాకెందుకు తట్టలేదీ ఆలోచన' అనుకుంటుండగా, నా అనుమాన నివృత్తి కన్నట్టుగా టపటపా మని రెక్కలు కొట్టుకుంటూ, పావురాయి పైకి లేచి, కిందకి చూస్తూ మమ్మల్నొక సారి పరామర్శించి మళ్లీ దాక్కుండి పోయింది.

మా పెద్దాడు సంతోషంతో "హేయ్... రేయ్ వినూ... పావురం... పావురం రా" అని అరుచుకుంటూ బెడ్ రూంలోకి పరుగెత్తాడు, తమ్ముణ్ణి లేపటానికి.

"రేయ్ వినూ... లేవరా... పావురం... పావురం వచ్చింది లోపలకి" అంటూ వాడి దుప్పటి లాగేసే సరికి వాడు అన్నని కాలితో ఒక్క తన్ను తన్ని దుప్పటి లాగేసుకొని ముసుగెట్టేసుకుని పడుకుండి పోయాడు.

వెధవ...ఈ చిన్న వెధవెప్పుడూ ఇంతే... స్కూలుకి పావుగంట టైముండగా, హడావుడిగా లేచి, 5 నిముషాలు స్నానం, 5 నిముషాలలో డ్రస్సు, షూసు వేసుకొని 5 నిముషాలు ఆలస్యంగా స్కూలులో వుంటాడు...

కాసేపయ్యే సరికి పనమ్మాయి వచ్చింది.

మళ్లీ... గుర్... గుర్....

"ఏంటమ్మగారూ! ఆ గోల..." అడిగింది.

"పావురం దేవీ.. పై నుంచి. ఎంత తరిమినా పోవడం లేదు. ఏం చేయాలో తోచటం లేదు..." అని అనడమేమిటి, బయట నుంచి టపటప మంటూ ఎగురుకుంటూ, దాని జంట పావురాయి రాజకుమారిలా మా మధ్య నుంచి తన్నుకుంటూ అటక పై కెక్కేసింది.

ఒక్క దానితోనే ఛస్తుంటే ఇదొకటా?

ఉస్సూరని నిట్టూర్పు...

దేవి ఒకటే నవ్వు...

ఇంతలో మా చిన్నాడొచ్చి "ఏంటి మమ్మీ?" అన్నాడు.

"పావుడం బాబూ" అంది మా పనమ్మాయి ఎగతాళిగా.

మా వాడికి 'ర' అక్షరం పలకదు... తాతగా'డు', నాన్నగా'డు'... ఇదీ వాడిచ్చే గౌరవం...

వాళ్లు స్కూలుకి వెళ్లిపోయాక, నా పనులలో పడి వాటి సంగతి మర్చి పోయాను... కానీ మధ్య మధ్యలో గుర్తు చేస్తున్నట్టుగా టపటపా చప్పుళ్ళు...

రెండు రోజుల తరువాత మా పనమ్మాయి

## మమతా, సుమన్‌ల సావాసం

పత్రికలకి సెక్సీగా పోజులివ్వడంలోనూ, ఒంటిమీద వేసుకునే బట్టల్లా మగాళ్లని మార్చడంలోనూ ఎవరికి వారే సాటి అని పేరు తెచ్చుకున్న మమతా కులకర్ణి, సుమన్ రంగనాథ్‌లు ప్రస్తుతానికి మగాళ్ల మాటే ఎత్తడం లేదని తెలిసింది. ఎందుకా అని కూపీ లాగితే 'ఫైర్' సినిమా ఇద్దరూ కలిసి చూసినప్పటి నుంచి ఇంటా బయటా కలిసే తిరుగుతున్నారట. మొత్తానికి వీళ్ల రుచి మరిగారన్నమాట.



దేవి తేల్చేసింది.

"అమ్మగారూ! అది గుడ్లు పెట్టేస్తుంది త్వరలో" అంటూ.

అనటమేమిటి మా వాడు హడావుడిగా వెంఠనే పై కెక్కి చూసి పెద్దగా అరిచాడు "గుడ్లు... పావురం గుడ్లు పెట్టిందోచ్" అంటూ...

నాకు తారెత్తింది. పైన సంవత్సరానికి సరిపడా బియ్యం, పప్పులు వున్నాయి. కుటుంబ సమేతంగా పావురాలు ఇక్కడ కావురం పెట్టేస్తే పై నున్న వెచ్చాలు, బియ్యం తింటానికి పనికి వస్తాయా?

వెంటనే గుడ్లు తీయించి, బాల్కనీలోని పూల మొక్కల మధ్య నున్న ఖాళీ కుండీలలో పెట్టించాను.

ఆ రోజు నుంచి మా ఇంట్లో హడావుడి... అవి పగిలి, పిల్లలు ఎప్పుడు బయటికి వస్తాయా అని.

పిల్లలు రోజూ లేవటం, వాటి దగ్గరకి వెళ్లి చూడటం, స్కూలుకి వెళ్లటం, రాగానే మళ్లీ పరుగెత్తుకుంటూ వెళ్లి చూడటం... డ్యూటీ లాగా...

ఎవరు ముందు పావురం పిల్లలను చూస్తామా అని పందెం కాసి ఎదురు చూస్తున్నారు.

* * * *

తెలతెల వారుతుండగా, బెడ్‌రూమ్ కిటికీ అవతల బాల్కనీ నుంచి కిచ...కిచ... మంటూ చిన్న అరుపులు సంగీతంలా వినిపిస్తుంటే, వింటూ పడుకున్నాను.

పిల్లలింకా నిద్ర లేవలేదు.

"ఒరేయ్ బాబులూ... పావురాయి పిల్లలు బయటికి వచ్చేశాయి... వాటిని ముందుగా నేనే చూడ బోతున్నా" అంటూ లేస్తుండగానే ఇద్దరూ నన్ను పక్కకు నెట్టేసి ఒకరినొకరు తోసుకుంటూ పరుగెత్తుకుంటూ బాల్కనీలోకి వెళ్లారు.

అంతా నిశ్శబ్దం...

నాకేమీ అర్థం కాలేదు.

"వీళ్ళేరీ"... అనుకుంటూ నేనూ బాల్కనీలోకి వెళ్లాను.

ఎదురుగా కుండీలో నాలుగు బుల్లి బుల్లి పావురం పిల్లలు... కళ్ళు మూసుకుని... మా వాళ్లు జంతు ప్రపంచం వింతలు చూస్తున్నట్టుగా నిశ్శబ్దమై పోయి అబ్బురంగా చూస్తున్నారు.

నాకు మనస్సంతా థ్రిల్లయి, సంతోషంగా చూస్తున్నా... నిజమే కదూ... సృష్టి అనేది జరగక పోతే ఈ ప్రపంచంలో అందం, ఆనందం ఏముంటుంది? పసి మొగ్గ – పువ్వు అవ్వటం చూస్తే ఆనందం. అప్పుడే పుట్టిన పసి పాప గుప్పెళ్లు మూసి కళ్లు మూసుకుని పడుకోటం, మెత్తటి శరీరం, చిన్న కళ్లు... ఎంత థ్రిల్లింగ్‌గా వుంటుందో, ఈ పక్షి పిల్లల్ని చూస్తుంటే! – అలాగే అనిపించింది.

అవి చాలా ముద్దుగా ఉన్నాయి.

ఆ రోజు నుంచి మళ్లీ హడావుడి మొదలు... మా పిల్లల క్లాసులో సగం మంది పిల్లలు వచ్చి చూసి వెళ్ళారు... ఎగ్జిబిషన్ లాగా...

కానీ వాటినేం చేయాలి? బాల్కనీలోని ఎండకి ఛస్తాయేమోనని భయం. అసలు సమస్య ఎండ కాదని తరువాత తెలిసింది.

* * * *

బయట నుంచి ఒకటే అరుపులు వినిపి

స్తుంటే బాల్కనీలోకి వెళ్ళి చూశాను. రెండు కాకులు రక్తం రుచి మరిగిన వులుల్లా ఆ పావురం పిల్లన్ని కొట్టెయ్యాలని అక్కడక్కడే తిరుగుతున్నాయి. తల్లి పావురం వాటిని దగ్గరకు రానివ్వకుండా అడ్డు పడాలని ప్రయత్నం చేస్తోంది. నేను కాకుల్ని తోలేసి కుండీ మూలకు నెట్టేసి, చుట్టూ చెట్లతో కవర్ చేసేసి బయటకు వెళ్ళి పోయాను.

సాయంకాలం బయటినుంచి రాగానే పిల్లలు ఎదురొచ్చి "మమ్మీ! పావురం పిల్లలను తీసు కెళ్ళటానికి కాకులు వస్తున్నాయే... చస్తాయేమో పాపం... కుండీని ఇంట్లో పెడదాం.." అంటూ వాటి తరవున రికమెండ్ చేశారు.

"ఏం అక్కర్లేదు. పావురాన్నీ, పిల్లల్నీ లోపల పెడితే ఇల్లంతా కరాబు చేస్తాయి. నేను చావాలి శుభ్రం చేయలేక. బయట వుంచండి. అప్పడప్పడు చూస్తుంటాంగా... బాగానే వుంటాయి" అంటూ వాళ్ల నోరు మూయించాను... కానీ నాకు మనసులో గిల్టీగానే వుంది.

ఆ రోజు పిల్లలు కోపంతో టిఫిన్ చేయకుండా, నాతో మాట్లాడటం మానేశారు.

* * * *

మరుసటి రోజు సాయంత్రం ఆఫీసు నుంచి వస్తుంటే మా స్నేహితురాలి కొడుకు నా కెదురొచ్చి "ఆంటీ! మీ సునీల్ రైలు పట్టాలు దాటి వస్తుంటే రైలు గుద్దేసిందట... ఎవరో చెప్పారు" అన్నాడు.

అంతే. నాకు తలంతా మొద్దుబారి పోయింది. కళ్లు తిరిగినట్లుంది. కాళ్లూ, చేతులూ వణుకు... ఇంట్లోకి వెళ్లటానికి ధైర్యం చాలక ఏం వినాల్సివస్తుందో అన్నట్లుగా, మా ఫ్రెండ్ ఇంటికొచ్చి పడి భోరున ఏడ్చేశా....

అందరూ కంగారు... 'ఏమయ్యింది. ఏమయ్యిందే' అంటూ!– విషయం చెప్పేసి పడి పోయాను. అంతా తలో దారి పరుగెత్తారు.

'భగవంతుడా! నాకు నా కొడుకు కావాలి. వాడు లేకపోతే నేను బతకను. నా బిడ్డని నాకు తెచ్చివ్వు. కావాలంటే నా ప్రాణం తీసుకో... నా బిడ్డని నాకివ్వు...' అనుకుంటూ వుండగానే మా వాళ్లు వచ్చారు.

"నీ మొహం లాగుందే. అనవసరంగా కంగారు పడ్డావు. ఎవరికీ ఏమీ కాలేదు. అంతా ప్రశాంతంగానే వుంది. పట్టాల మీద పడింది మనిషి కాదే... చిన్న దూడ పిల్లంట... నీకెవరో రాంగ్ ఇన్ఫర్మేషన్ ఇచ్చి ఏడిపించారు. కంగారు పడకు లే, ఇంత పెద్ద ఫ్లాట్స్‌లో ఏ మూలో ఆడుకుంటూ వుంటాడు. వెళ్లి వెతుకు. ధైర్యంగా వుండు" అన్నారు.

మెల్లిగా ధైర్యం తెచ్చుకుని, ఆరు అంతస్తులూ ఒక్కో మెట్టూ దిగుతూ కిందకి వచ్చాను. వస్తున్నంత సేవూ పావురం పిల్లలను రక్షించుకోవడం కోసం పిల్లలు చేసిన అరువులు... కాకుల గోల...మెదడంతా ఇదే!

"ఏమయ్యింది మమ్మీ..."అంటూ వాడు బిత్తర పోయాడు. ఎవరో చెబితే విని అందరూ నవ్వులు...

ఆ పరిస్థితుల్లో నాది తెగివి తక్కువ తనం ఎలా అయ్యిందో నాకు అర్థం కాలేదు. పిల్లలతో కలిసి ఇంటికొచ్చాను.

మా బెడ్‌రూం మంచం వక్కనుంచి పిల్లల కిలకిలా రావాలు. నేను పిల్లల వైపు ఆశ్చర్యంగా చూస్తే, వాళ్లు నా వైపు భయం భయంగా చూస్తూ,

"మమ్మీ! మరే కాకులొచ్చి ఓ పిల్లని ఎత్తుకుని పోయి తినేశాయి. అందుకని వాటిని బయటి నుంచి తీసి లోపల పెట్టాము...కావాలంటే అవి పాడుచేసినంత మేరా, మేము శుభ్రం చేస్తాం.. ప్లీజ్ మమ్మీ..." అన్నారు.

ఇద్దరినీ దగ్గరకి తీసుకుని ముద్దు పెట్టుకున్నాను.

తల్లి పావురాయి – పోయిన నాలుగో బిడ్డ కోసం దిగులుతో వుంది.

ఆ రోజు నుంచీ నా ఇద్దరు బిడ్డలతో, దాని ముగ్గురు బిడ్డలతో మా ఇల్లు కళకళలాడి పోతూనే ఉంది.

